


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 3 మే 2025



- నినదించిన జనం.. నేతలు
- హోరెత్తిన రాజధాని గ్రామాలు
- జన జాతరను తలపించిన వెలగపూడి
- పునఃనిర్మాణానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- మేళతాళాలతో రాజధాని రైతులు, మహిళల ఆహ్వానం
- మంగళగిరి నుంచి వెలగపూడి వరకూ ట్రాఫిక్ దిగ్బంధనం

..జై అమరావతి

భానుడు భగభగమంటున్నా.. అమరావతి పండుగకు తరలివచ్చిన వారిని చూస్తే కలల రాజధానిపై ప్రజల్లో మమకారం ఏమాత్రం తగ్గలేదని అర్థమవుతోంది. వినాశనం నుంచి వికాసం దిశగా పయనిస్తోన్న అమరావతి అభివృద్ధికి జనం జయజయధ్వానాలు .. నేతల చప్పట్ల మధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమరావతి అత్యద్భుత అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని నేతలు ప్రతినపూనగా.. జై అమరావతి.. జైజై అమరావతి నినాదాలతో జనం హోరెత్తించారు. అమరావతి పునర్నిర్మాణ మహోత్సవాన్ని రాజధాని గ్రామాల వాసులు ఓ పండుగగా భావించగా.. రాష్ట్ర నలుమూలల నుంచి జనం జాతరకు తరలివచ్చినట్లుగా వచ్చారు. దీంతో శుక్రవారం రాజధాని గ్రామాలతో పాటు వెలగపూడి జనసంద్రంగా మారింది. నేతల నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరూ ఎటువంటి ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది. అమరావతి ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో కాదని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మూడేళ్లలో అమరావతి నిర్మాణం జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో చెప్పడంతో అటు నేతలు.. ఇటు ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది.

అభివృద్ధి అంటే .. చంద్రబాబు

అభివృద్ధి చేయడం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ప్రధాని మోదీ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపానన్నారు..





మురిసిన రాజధాని రైతులు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి కోసం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు మురిసిపోయారు. గత ఐదేళ్లు అష్ట కష్టాలు పడ్డామని.. ఈ పరిస్థితుల్లో తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు పడిన కష్టాలను మరిచిపోయేలా అమరావతి భవి ష్యత్తు కనిపిస్తోందంటూ పలువురు రైతులు, మహిళలు, కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వం కూడా సభలో అమరావతి రైతులకు పెద్దపీట వేసింది. వారికి ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేసింది. వీఐపీల మాదిరిగా వారికి ప్రత్యేక ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేసింది.

అమరావతి.. ఆకాంక్ష

వెలగపూడి సభ సాక్షిగా కలల రాజధాని అమరావతిపై అన్నివర్గాల్లోనూ అభిమానం ద్విగిణీకృతమైంది. అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వయస్సుల ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారితీసే మార్గాల్లో జన సందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకు పోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు. మహిళలు ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్క చేయకుండా అమరావతికి తరలిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.



వెల్లివిరిసిన.. జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు.. వాటి ఆనవాళ్లకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు కూడా మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. ఇక సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోకి కేవలం మువ్వన్నెల జాతీయ జెండాలను మాత్రమే అనుమతించారు. ప్రధాని నరేంద్ర మోదీ సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం అంటూ జెండాలు ఊపుతూ హర్షధ్వానాలు చేస్తూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో.. అమరావతి అంటూ పచ్చ కండుకావాలు గాలిలో ఊపారు. అలానే ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.



తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభతో అమరావతి జనసంద్రంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ రూ.58వేల కోట్ల పనుల ప్రారంభోత్సవం చేశారు. ఈ సభ సందర్భంగా రాజధాని గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతేనంటూ జనాలు నినదించారు. స్థానిక రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా అమరావతికి మద్దతుగా నినాదాలు చేశారు. సభ జరిగే వెలగపూడితో పాటు రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల్లోనే అదే వాతావరణం కనిపించింది. రాజధాని మండల కేంద్రమైన తుళ్లూరుతో పాటు పలు గ్రామాల్లో రైతులు, మహిళలు మేళతాళాలతో శుక్రవారం ఉదయం పాదయాత్ర చేస్తూ సభకు తరలి రావాలని ప్రజలను ఆహ్వానించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు వందల సంఖ్యలో బస్సులు, కార్లు ముందురోజు సాయంత్రానికే చేరుకోగా ఆయా వాహనాల్లో జనం అమరావతికి తరలి వచ్చారు. వారికి ప్రత్యేకంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ప్యాకె ట్లు అందజేశారు. సభా ప్రాంగణానికి ఆలస్యం గా చేరుకున్న వీఐపీలకు అనుమతి లభించ లేదు. జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్‌అహ్మద్‌లకు వీఐపీ పాసులు ఉన్నా గ్యాలరీ నిండిపోయిందని పోలీ సులు అనుమతించలేదు. సభకు వెళ్లే మార్గాల న్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. బస్సులు వెలగపూడి వైపు వెళ్లడానికి బారులు తీరడంతో మధ్యాహ్నానికి ట్రాఫిక్ దిగ్బంధనం ఏర్పడింది. సభకు చేరుకోవడానికి 8 మార్గాలను గుర్తించినా, ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ మంగళగిరి వైపే వచ్చాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును కాజ దగ్గర నుంచి వెలగపూడి సభ కోసం అనుమతించినా చాలామంది కృష్ణాయపాలెం రోడ్డు వైపే వచ్చారు. దీంతో తాడేపల్లి, మంగళగిరి వైపు నుంచి వచ్చే బస్సులన్నీ కృష్ణాయపాలెం జంక్షన్ వద్ద నుంచి ఆగిపోయాయి. ఆ జంక్షన్ నుంచి మందడం సరిహద్దుల్లోని వెస్ట్ బైపాస్ అండర్ పాజ్, ఈ-8 రోడ్డు జంక్షన్ వరకూ బస్సులు నిలిచిపోయాయి. సభానంతరం తిరిగి వెళ్లే సమయంలో కూడా అదే పరిస్థితి పునరావృతమయింది.

మధ్యాహ్నానికే కిటకిట

అమరావతి సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నం 12 గంటలకే నిండిపోయింది. ఎండ భగభగ మండుతున్నా జనం వాటిని లెక్క చేయకుం డా తరలివచ్చారు. రాజధాని సమీప జిల్లా లైన ఇటు గుంటూరు, పల్నాడు, అటు ఎన్టీఆర్ విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా జనం తరలివస్తారని అంచనా వేయ గా అంతకుమించి జనం పోటెత్తారు. దీంతో వెలగపూడి గ్రామం జనసంద్రాన్ని తలపించింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ -6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.



అన్నిమార్గాలూ.. అమరావతి వైపే

అమరావతి పునర్నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండుగలా నిర్వహించగా.. రాజధాని సమీప జిల్లావాసులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి జనం పోటెత్తారు. కలల రాజధాని.. మన అమరావతి.. ఛలో అమరావతి.. జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజధానికి దారితీసే మార్గాలన్నీ ఉదయం నుంచే వాహనాలు, జనంతో సందడిగా మారాయి. ఇటు తాడికొండ.. అటు మంగళగిరి, తాడేపల్లి రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. అమరావతి సభకు వచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా భోజన, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో పలువురు సేద తీరారు.









హెలీప్యాడ్ వద్ద మోదీ స్వాగతం..



సభకు తరలివస్తున్న విద్యార్థినులు, మహిళలు



గ్యాలరీల బయట మహిళల సందోహం



జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

వెలగపూడిలో పార్కింగ్ స్థలంలో బస్సులు



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

● రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని



వీల్ చైర్లు అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలబడుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త ఘంటా పున్నారావు సౌజన్యంతో స్థానిక స్తంభాలగరువు మహాప్రస్థానంకు వీల్‌చైర్లు సమకూర్చారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యాలయంలో సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నన్నపనేని పాల్గొన్నారు. వీల్‌చైర్లను నిర్వాహకులకు అందజేశారు. సంస్థ స్ఫూర్తితో జీజీహెచ్‌కు మూడు వీల్ చైర్లు అందజేస్తామని ఆమె తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతయ్య, మహాప్రస్థానం ఉపాధ్యక్షుడు సుందర రామయ్య, కార్యదర్శి తాండవ కృష్ణ, మానవతా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పదవికే వన్నెతెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల

● రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ స్పీకర్ విగ్రహావిష్కరణ



డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ లావు తదితరులు

నరసరావుపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏ పదవి నిర్వహించిన దానికి వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మాజీ స్పీకర్, దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ హోం మినిస్టర్ అంటే పలాన శివప్రసాదరావు అని ఈరోజు కూడా గుర్తు చేసుకునే విధంగా పనిచేశారని కొనియాడారు. స్పీకర్‌గా పనిచేసి ఆ కుర్చీకే గౌరవం తీసుకొచ్చిన మహావ్యక్తి అని ప్రశంసించారు. అసెంబ్లీలో నాడు తాను ప్రతిపక్షంలో ఉండి ఏప్పుడు మైకు అడిగినా ఇవ్వని రోజు లేదని గుర్తుచేసుకున్నారు. నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు మన మధ్య లేకపోవడం బాధాకరం మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలో భాగంగా కోడెలపై చిన్న చిన్న నిందలు వేసి ఆయనను మన మధ్యలేకుండా చేశారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి, నసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విగ్రహావిష్కరణ పూర్తి చేయాలనే నిర్ణయించుకొని కార్యక్రమం ఘనంగా నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలో మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ జెండాను ఐదుసార్లు అప్రతిహతంగా ఎగరవేయగలిగారని కొనియాడారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సెప్టెంబరు 16న వినుకొండలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణం జరిగే రోజున ఆయన నిర్మించిన ఆసుపత్రి ఆవరణలో 77వ జయంతి సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఆవిష్కరణ, టీడీపీ కుంటుంబ సభ్యులందరూ ఇక్కడ కలుసు కోవడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పల్నాడు ప్రాంతానికి ఒక గౌరవాన్ని తెచ్చిన మహానాయకుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, లలిత్‌సాగర్, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆసుపత్రి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటిటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కుమ్మెత కోటిరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, కొండ్రుగుంట లక్ష్మి, డాక్టర్ పూరేటి భారతి తదితరులు పాల్గొన్నారు.

రేపు నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

● ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాలు, 4,250 మంది విద్యార్థులు

గుంటూరు (విద్య) మే 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించే (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్)నీట్ ఆదివారం జరగనుంది. పరీక్ష కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్‌టీఏ మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసింది. 4,250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షకు విస్తృత భద్రత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు డ్రెస్ కోడ్ పాటించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే నిబంధనలతో కూడిన సమాచారాన్ని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంస్కృతిలో భాగం: మంత్రి సత్యకుమార్ యాదవ్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు నిర్వహించడం సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా వస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలకు శుక్రవారం రెండవ రోజు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలిరోజు టచ్‌పళ్ల విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎడ్ల పందేలను ప్రారంభించి, జతల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మన జీవన విధానంలో పశువులను కుటుంబ సభ్యులుగా చూస్తామని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవితంలో ఆటవిడుపుగా ఇలాంటి పోటీలకు వచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగ వాతావరణంలో 8రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను తాను ఊహించలేదన్నారు. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన తాను తన జీవితంలో ఇంత పెద్దస్థాయి పందేలను మొదటిసారిగా చూస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదర్శ ప్రజానాయకుడు అని కొనియాడారు. ఆరు సార్లు గెలుపొందడమంటే ఎలా విజయం సాధించవచ్చో నరేంద్రకుమార్‌ను చేసి నేర్చుకుంటున్నామన్నారు. రెండు పళ్ల విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 24 జతల ఎడ్లు 800కిలోల బండను లాగి పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి.

మూడేళ్లలో పూర్తిగా..

మారనున్న అమరావతి రూపురేఖలు: ప్రత్తిపాటి



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణం నవ్యాంధ్ర ప్రగతికి దోహదపడే సరికొత్త ప్రయాణం అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. ఆంధ్రమాత గర్వించేలా, భరతమాత మురిసేలా జోరుగా ప్రజా రాజధాని నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికే తలమానికమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ ఘట్టం ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగడం తెలుగు ప్రజలకు కనివినీ ఎరుగని గొప్ప సంబరంగా నిలిచిందన్నారు. ఇక అమరావతిలో పనుల జోరు పెరిగీ, రాష్ట్రానికి మరిన్ని కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల దుష్ట, స్వార్థ రాజకీయాలకు బలైన అమరావతి కూటమి ప్రభుత్వ రాకతో, ప్రధాని మోదీ అండతో బతికి బంగారు బాటపట్టిందని వివరించారు. వచ్చే మూడేళ్లలో అమరావతి రూపురేఖలు పూర్తిగా మారిపోయి ఆంధ్ర ప్రజల రాజధాని కలలు సాకారమవుతాయని ఆకాంక్షించారు. అమరావతి శ్మశానమని, ఎడారని, కేవలం ఒక వర్గానికే పరిమితమని వైసీపీ ప్రభుత్వం చిమ్మిన విద్వేషం, నిర్మాణ పనుల్లో చేసిన విధ్వంసం అంతా ఇంతాకాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ దొంగలు చివరకు నిర్మాణ సామగ్రిని, రోడ్లను కూడా తవ్వేసి అమ్ముకునేంతలా దిగజారారని విమర్శించారు. చంద్రబాబు ప్రారంభించిన అమరావతి పనులు కొనసాగిస్తే, తనకు ఒరిగేదేమీ ఉండదనే సంకుచిత బుద్ధితో జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాట ఆడి, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రేపి, పబ్బం గడుపుకునే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. చంద్రబాబు పిలుపుతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల్ని నిర్దాక్షిణ్యంగా హింసించాడని అన్నారు. జగన్ దౌర్జన్యాలు, దాష్టీకాలు, దమనకాండను తట్టుకొని మొక్కవోని దీక్షతో 1,631రోజుల పాటు రైతులు, మహిళలు చేసిన పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ప్రధాని మోదీ సాక్షిగా జరిగిన రాజధాని బహిరంగసభ అమరావతి రైతుల ఆనందభాష్పాలు, భావోద్వేగాలతో పులకించిందని అన్నారు.

రైల్వే పనుల్లో నాణ్యత పాటించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

గుంటూరు (తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఆర్‌వోబీ, అమృత్ భారత్ కింద జరుగుతున్న రైల్వే స్టేషన్ పనులు పూర్తిస్థాయి నాణ్యతతో ప్రజలకు అందించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు రీజినల్ డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్, పెదపలకలూరు, అలాగే అసంపూర్తిగా ఆగిన నందివెలుగు ఆర్‌వోబీ తదితర వంతెనల పనులను త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. అమృత్ భారత్ కింద గుంటూరులో జరిగే రైల్వే స్టేషన్ పనులను గతంలో తాను పరిశీలించానని, అవి నాసిరకంగా కనిపించాయని చెప్పారు. సుధేష్ణ సేన్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశం మాదిరిగా ఆర్‌వోబీలపై షెడ్లు (రూఫ్ టాప్) ఏర్పాటు చేయాలని, దీంతో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల ప్రమాదాలను, పశువుల రాకపోకలు నివారించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు.

సిబ్బంది కొరతతో 8 రైళ్ల రద్దు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బంది గ్రూపు-బీ పరీక్షకు హాజరు కానుండడంతో ఎనిమిది రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో (57201) విజయవాడ- గుంటూరు, (57203) గుంటూరు- మాచర్ల, (57206) మాచర్ల- నడి కుడి, (57205) నడికుడి -మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు- విజయవాడ రైళ్లను, 4, 5 తేదీల్లో (67779) కాచీగూడ- నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

అమరావతి సభకు చేరకుండానే..

ఎన్‌హెచ్-16 టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



కాజ టోల్ ప్లాజా వద్ద ఆగిన బస్సులు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃప్రారంభ బహిరంగ సభకు.. ఎన్నో ప్రయాసలకోర్చి వచ్చిన వేలాది మంది ప్రజలు చేరుకోలేకపోయారు. ముఖ్యంగా ఎన్‌హెచ్-16 చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారి మీదగా వచ్చిన వాహనాలు కాజా టోల్ ప్లాజా వద్ద వేలాది సంఖ్యలో నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు దాదాపుగా ఐదు కిలోమీటర్ల పొడవునా బారులుదీరాయి. అలానే మంగళగిరి నియోజకవర్గంలో డాన్ బాస్కో స్కూలు నుంచి యర్రబాలెం, కృష్ణాయపాలెం వరకు ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. హైవే మీద వాహనాలు సులభతరంగా సభా స్థలికి చేరుకొం టాయని అంతా భావించారు. అయితే అందుకు విరుద్ధంగా చిన్న రోడ్లలో వచ్చిన వాహనాలు ప్రాంగణం వద్దకు సులభ తరంగా చేరుకొన్నాయి. ఇక్కడ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. రాయ లసీమ, పల్నాడు వైపు నుంచి వచ్చిన వాహనాలకు అమరావతి మీదగా రూట్ ఇచ్చారు. ఈ మార్గంలోనూ ట్రాఫిక్ స్తంభిం చిపోవడంతో చాలామంది మహిళలు బస్సుల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వాళ్లలో చాలామంది సభ వద్దకు రాకుండానే వెనుదిరిగారు. దాంతో మహిళలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

తెరుచుకున్న విజయవాడ వెస్టు బైపాసు

ప్రధాని సభ దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకూడదని విజయవాడ వెస్టు బైపాసు రోడ్డుని తాత్కాలికంగా తెరిచారు. దీంతో ఎన్‌హెచ్-16లో చినకాకాని వెంకటపాలెం వద్ద సర్వీసు రోడ్డు నుంచి సీడ్‌యాక్సిస్ రోడ్డుకు వాహనాలను మళ్లించారు. అలానే విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను సూరాయపాలెం నుంచి కృష్ణానది వంతెన మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి అనుమతించారు. దీంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు ప్రధాని రాక ముందే సభాస్థలి వద్దకు చేరుకొన్నాయి.

పోలీసుల ఓవరాక్షన్

ప్రధాని సభ సందర్భంగా పోలీసులు చాలా చోట్ల అతిగా ప్రవర్తించారు. కొంతమంది వీవీఐపీలు, వీఐపీలను కూడా వారికి కేటాయించిన గ్యాలరీల్లోకి అనుమతించలేదు. దీంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. తగిన పాస్‌లతో వచ్చినా వాహనాలను.. వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోకి అనుమతించకుండా బస్సులు పార్కింగ్ చేసిన ప్రాంతానికి మళ్లించారు. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలానే బహిరంగ సభ జరిగిన ప్రదేశంలో దాదాపుగా లక్ష కుర్చీల వరకు వేశారు. తొలుత ఆ గ్యాలరీల్లోకి అనుమతించకుండా స్టాండ్‌బై వేదికకు ఎదురుగా సిద్ధం చేసిన ప్రాంగణంలోకి ప్రజలను తరలించి, కింద కూర్చోబెట్టారు. అక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వాటిల్లోనే సభ చూడాలన్నారు. తాము ఇంత ప్రయాస పడి వచ్చింది సభని ఎల్ఈడీ తెరల్లో చూడటానికా అని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాలరీల్లోకి అనుమతించకుండా అడ్డుకోవడం పైనా పోలీసుల తీరును తప్పుబట్టారు.

67,379 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 65,069 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 67,379 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,246 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13700
334	9500	13200	షార్క్-1	----	----
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	-----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300			
4884	10000	11200	దేవనూరుడీలక్స్	10000	12600
సూపర్10	10000	12300	ఆర్మూరు	9800	11200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన అగ్నిప్రమాదం



కమ్ముకున్న నల్లటి దట్టమైన పొగ

తుళ్లూరు (మందడం) మే2(ఆంధ్రజ్యోతి): మందడం దగ్గరిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం ఓ ఏజన్సీ కంపెనీ గతంలో నిల్వ చేసి ఉంచిన ప్లాస్టిక్ పైపుల గుట్టకు నిప్పు అంటుకుంది. మంటలు ఎగసి పడటం, నల్లటి దట్టమైన పొగ కమ్ముకోవడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రధాని సభ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో అప్రమత్తమయ్యారు. దాదాపు గంటన్నర పాటు మంటలు చెలరేగుతూ నల్లటి పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ఇలా చేశారు.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే ప్రదేశానికి ఈ ప్రాంతం ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది.

బాపట్ల వార్తలు



ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

విజయవంతంగా నిర్వహించిన అధికారులకు కలెక్టర్ అభినందనలు

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళి అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి తరలివెళుతున్న ప్రజలకు బస్సులు ఏర్పాటు చేసి వాటి కదలికలు తెలుసుకొనుటకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బస్సు కదలికలను ఆయన పర్యవేక్షించారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల నుంచి 380 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అద్దంకి నియోజకవర్గం నుండి 71 బస్సులలో 3వేల మందిని, బాపట్ల నియోజకవర్గం నుంచి 68 బస్సులలో 2,750 మంది, రేపల్లె నియోజకవర్గం నుంచి 58 బస్సులలో 2,500 మంది, వేమూరు నియోజకవర్గం నుంచి 52 బస్సులలో 2,250 మంది, పర్చూరు నియోజకవర్గం నుంచి 72 బస్సులలో 3 వేల మంది, చీరాల నియోజకవర్గం నుంచి 59 బస్సులలో 2,500 మంది తరలివెళ్ళారన్నారు. మొత్తం 16 వేల మంది బాపట్ల జిల్లా నుంచి అమరావతి సభకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. బాపట్ల నియోజకవర్గం నుంచి వెళ్ళిన బస్సులకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన భోజన స్టాల్‌ను కలెక్టర్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. బస్సులోని ప్రయాణికులకు అన్ని అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, కమాండ్ కంట్రోల్‌లో విధులు కేటాయించిన సిబ్బంది పాల్గొన్నారు.


వైభవంగా శివ కల్యాణ మహోత్సవం

బాపట్ల, మే2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ధృతిసాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలం దేవస్థానం నిర్వహణలో శివకల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్తబస్టాండ్‌లోని శ్రీ కోదండరామాలయం దగ్గర నుంచి పాతబస్టాండ్, గడియారస్తంభంసెంటర్ మీదగా టౌన్‌హాలు వరకు శోభాయాత్ర నిర్వహించారు. నిర్వాహకులు, సంస్థ అధ్యక్షుడు కళ్ళం హరినాథరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శోభయాత్రకు అగ్రభాగాన ఉండి నడిపించారు. అనంతరం టౌన్‌హాలులో వేదపండితులు సాంప్రదాయపద్ధతిలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, చీరాల గోవర్ధనరెడ్డి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు బొంతు సాంబశివారెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, అల్లంగోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



శివకల్యాణంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, చీరాల గోవర్ధనరెడ్డి నిర్వాహకుడు కళ్ళం హరినాథరెడ్డి తదితరులు

శ్రీ కామరూపిణి మహాదేవిగా శ్రీ బగళాముఖి అమ్మవారు



పిట్టలవానిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ళ మహోత్సవాలలో భాగంగా మూడో రోజు శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రీ కామరూపిణి మహాదేవిగా విశేష అలంకారం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీ బగళాముఖి అమ్మవారికి ఉదయం 7 గంటలకు విశేష పూజా కార్యక్రమాలు, వేదమంత్రాలతో అభిషేకాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శ్రీబగళాముఖి అమ్మవారికి భక్తులు బాలభోగం సమర్పణ గావించారు. అమ్మవారి ప్రతిరూపాలైన పావనం, ఘటముతో భవనవారిపాలెం, చౌడిపాలెం గ్రామాలలో అమ్మవారిని ఊరేగింపుగా నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు వై.బి.రాజేంద్రప్రసాద్, బి.శ్రీరామశర్మ, పి.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణ మహోత్సవం



శాంతికల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి శ్రీ త్రిశక్తిదేవాలయంలో నిర్వహిస్తున్న తిరునాళ్ళ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం శాంతికల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం వరకు జరిగే ఈ వేడుకలలో శుక్రవారం ఉదయం తోరణపాకు అలంకరణ, విఘ్నేశ్వరపూజ, శాంతి కల్యాణం జరిగింది. రాత్రి గ్రామోత్సవం జరిపారు. శనివారం అమ్మవార్లకు విశేష పూజ, అర్చనలు, పూల అలంకరణ, సాయంత్రం 5 గంటలకు పసుపుకుంకుమబళ్ళు గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పిస్తారు. సాయంత్రం కోదండరామ కోలాట సమాజంచే కోలాట ప్రదర్శన జరుగుతుంది. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు, పూలతో అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పొంగళ్ళ నైవేద్యం, సాయంత్రం విద్యుత్‌ప్రభ ఊరేగింపు, కనకతప్పెట్లతో, మేళతాళాలతో, విచిత్ర వేషదారణలతో, విద్యుత్ వెలుగులతో తిరునాళ్ళ వేడుక జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కర్లపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల జడ్పీహెచ్ చింతాయపాలెం హైస్కూల్‌లో 2003-2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. 230 మంది విద్యార్థులకు ప్యాడ్లు, 3 బుక్స్ పెట్టుకునే ర్యాక్స్, 5 గ్రీన్ బోర్డులను పాఠశాలకు అందించారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థులకు అండగా చదువులో ముందుకెళ్ళడానికి తోడుగా ఉంటామని పూర్వ విద్యార్థులు భరోసానిచ్చారు.



జడ్పీహెచ్ చింతాయపాలెం హైస్కూల్ 2003-2004 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

హనుమాన్ చాలీసా పారాయణం

కర్లపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో హనుమాన్ జయంతి మండల ఉత్సవాలలో భాగంగా మహిళా భక్తులు 21వ రోజు 11సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మహిళా భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆంధ్రుల కలల పునరావిష్కరణ రాజధాని నిర్మాణం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- అమరావతికి భారీగా తరలివెళ్లిన ప్రజలు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కూటమి నాయకులు

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణం మాత్రమే కాదని ఆంధ్రుల కలల పునరావిష్కరణ అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. అమరావతి పునఃప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీ భారీ బహిరంగసభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు బాపట్ల నియోజకవర్గం నుంచి బస్సులలో కూటమిశ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించి బస్సులలో వెళుతున్న వారికి పండ్లు, అల్పాహారం, భోజనం, వాటర్ బాటిల్స్ స్వయంగా అందజేశారు. పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన భోజనాలను ఆయన అందజేశారు. 2024లో కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో కమ్ముకున్న చీకట్లు పోయి వెలుగులు వచ్చాయని నరేంద్రవర్మ అన్నారు. రైతులు నమ్మి ఇచ్చిన భూమి నేడు సద్వినియోగమౌతుందన్నారు. ఇప్పటి వరకు రాజధాని లేని మనకు ప్రపంచస్థాయి నగరం సిద్ధమౌతుందన్నారు. కూటమి పాలనలో ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీకగా, అభివృద్ధి కాంక్షలకు మార్గదర్శకంగా అమరావతి మళ్ళీ శక్తిని సంతరించుకొని ప్రధాని నరేంద్రమోదీ గిరిసంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో అమరావతి గ్లోబల్ సిటిగా అవతరించి దేశానికే తలమానికంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, ఇనగంటి గాంధీ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సిఎంఎం ఎస్.సుబ్రహ్మణ్యం, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఆర్వో అబ్దుల్ జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమరావతి చేరుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అక్కడ చీరాల, పర్చూరు ఎమ్మెల్యేలు ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు తదితర నాయకులతో కలిసి సభాప్రాంగణంలో కలియతిరిగారు.

బాపట్ల మండలంలో...

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు బాపట్ల మండలంలోని వివిధ గ్రామాల నుంచి 19 బస్సులలో కూటమిశ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ ఆధ్వర్యంలో ఈతేరు గ్రామం నుంచి బస్సులో పార్టీశ్రేణులు తరలి వెళ్ళారు. శుక్రవారం ఉదయం గ్రామంలో అల్పాహారం ఏర్పాటు చేసి గ్రామపెద్దలు, పంచాయతీ సిబ్బంది, సచివాలయసిబ్బంది పంపిణీ చేశారు. బస్సులలో వెళ్ళే వారికి పండ్లు, మజ్జిగ, వాటర్, భోజనం ప్యాకెట్‌లు ఎంపీడీవో బాబురావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేష్, సీసీలు రత్నరాజు, సుమలత, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏట్రవారిపాలెంలో...

కర్లపాలెం, మే2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ సభకు కర్లపాలెం మండల ఏట్రవారిపాలెం గ్రామం నుంచి బస్సులో టీడీపీ గ్రామ ఇన్‌చార్జి చీరాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో అక్కల వెంకటరెడ్డి, కోమట్ల చలపతిరెడ్డి, పరిశా గోపిరెడ్డి, నంగు సాంబశివరెడ్డి, మాడా శ్రీనివాసరావు, మునిపల్లె చిన్న, సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, మే2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు మండలంలోని 14 గ్రామపంచాయతీలకు సంబంధించి టీడీపీ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ మండల సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిల ఆధ్వర్యంలో, పిట్టలవానిపాలెం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, మండలపరిషత్ సూపరింటెండెంట్ డి.మధుసూదనరెడ్డిల పర్యవేక్షణలో మండలంలోని 12 గ్రామసచివాలయాలకు చెందిన కార్యదర్శుల ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన 12 బస్సుల లో సభకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలగాని నారాయణ, గోకరాజు నరసరాజు, ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు, తెలుగు మహిళలు తదితరులు ఉన్నారు. బస్సులలో బయలుదేరి వెళ్ళిన వారికి అధికారులు, నాయకులు భోజనం, మజ్జిగ ప్యాకెట్‌లు, తాగునీటి సదుపాయాలు కల్పించారు.

రేపల్లెలో...



బస్సులకు జెండాఊపి ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

రేపల్లె, మే 2(ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు రేపల్లె నియోజకవర్గం నుంచి కూటమి నాయకులు శుక్రవారం భారీగా తరలివెళ్ళారు. అమరావతి సభకు తరలివెళుతున్న బస్సులకు జెండా ఊపి మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి అన్నారు. రాజధాని నిర్మాణం కోసం వేలకోట్ల రూపాయలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంజూరు చేయటం ఇందుకు నిదర్శనమన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ఒక్క ఇటుకను కూడా పేర్చిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధి, రాజధాని నిర్మాణం కోసం పట్టుదలతో ముందుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, రేపల్లె రామాంజనేయులు, వడ్డి లక్ష్మీజీ, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేమూరు, చుండూరు మండలాల నుంచి...

వేమూరు, చుండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన మహాసభకు వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, చుండూరు మండలాల నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మహిళామణులు అధిక సంఖ్యలో వెళ్లడం విశేషం. ప్రతి గ్రామం నుంచి ముందుగా ర్యాలీలు నిర్వహించి అనంతరం స్థానిక పార్టీల నాయకులు ద్వారా పార్టీ జెండాలు ఊపి రాజధాని అమరావతికి నినాదాలు చేసుకుంటూ తరలివెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జేజేలు కొట్టుకుంటూ ద్విచక్ర వాహనాలు, టాక్సీలు, బస్సుల ద్వారా తరలివెళ్లారు. ప్రతి ఒక్కరికి పార్టీల శ్రేణులు భోజన వసతి, అల్పాహారం, మంచినీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు మరి ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి గ్రామం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీ అభిమానులు జనసమీకరణకు కృషి చేశారు.



వేమూరు నుంచి అమరావతి రాజధానికి బయలుదేరిన టీడీపీ శ్రేణులు

కొల్లూరులో...

కొల్లూరు, భట్టిప్రోలు, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కొల్లూరులో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల గ్రామాల నుంచి 50 వాహనాలలో ప్రజలు అమరావతి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు, ఏపీఎం రాము, డీసీ చైర్మన్ యలవర్తి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కాసరనేని మోహన్, పెదపూడి నాగరాజు, బుర్రి జగన్, గాదె చంటి, వేములపల్లి మోహనకృష్ణ, పోతార్లంక కుటుంబరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కొల్లూరు నుంచి ప్రధాని సభకు బస్సులలో తరలివెళుతున్న కూటమి శ్రేణులు

భట్టిప్రోలులో....

భట్టిప్రోలు మండల పరిధిలోని గ్రామాల నుంచి కూటమి శ్రేణులు 44 వాహనాలలో అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల పార్టీ అధ్యక్షుడు వాకా శేషుబాబు, మోటూరి పుణ్యశ్రీనివాసరావు, వేములపల్లి జగన్నాథరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రధాని మోదీ సభకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

అమృతలూరులో...

అమృతలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు పార్టీ శ్రేణులు భారీగా శుక్రవారం తరలివెళ్లారు. అమరావతిలో జరిగే సభకు ప్రధానమంత్రి మోదీ హాజరు కానున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా జనసమీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. అమృతలూరులో వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి గంగాధర్ సభకు వెళ్లే బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రొత్తపల్లి రవీంద్రబాబు, సర్పంచ్ దేవరకొండ రాము, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ విచ్చేస్తున్న సందర్భంగా చెరుకుపల్లి మండలం నుంచి కూటమి నేతల ఆధ్వర్యంలో ప్రజలు వేలాదిగా తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివి రాంబాబు, బాపట్ల జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గోగినేని వసుధ, నాయకులు కొనకాల రవికిరణ్, ఉప్పల సాంబశివరావు, చెల్లి రవికుమార్, పొన్నపల్లి సత్యనారాయణ, కందుల వెంకటేశ్వరరావు, మండవ తాతాజీల ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్ళారు.

నగరంలో...

నగరం, మే 2(ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం పిలుపునిచ్చారు. నగరంలోని 17 గ్రామ సచివాలయాల నుంచి 15 బస్సులలో 912 మంది రాజధాని పునర్నిర్మాణ సభకు తరలివెళ్ళారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ అందరి భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు నిర్మిస్తున్న రాజధాని ప్రధానమంత్రి మోదీ చేతుల మీదగా పునఃప్రారంభమవుతుందని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ అత్యున్నత స్థానానికి చేరుతుందని, భవిష్యత్తులో నిరుద్యోగ సమస్య కూడా సమసిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, నగరం స్పెషలాఫీసర్ సైదా నాయక్, వాకా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాళీకమ్మ తల్లికి జాతర ఉత్సవాలు

కర్లపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ కాళీకమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను శుక్రవారం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ముందుగా శ్రీ కాళీకమ్మతల్లి అమ్మవారికి సుమారు 100 మంది మహిళలు పలు రకాల జలాలను బిందెలతో తీసుకొచ్చి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీకాళీకమ్మతల్లి అమ్మవారిని కనకతప్పెట్లు, మేళతాళాలతో కర్లపాలెం పురవీధులలో ఘనంగా ఊరేగింపుగావించారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

కబడ్డీ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

బాపట్ల, మే2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభించినట్లు డీఎస్‌డీవో కె.పాల్‌కుమార్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కబడ్డీ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు శిక్షణ పొందటం వల్ల క్రీడలలో నైపుణ్యత పెంపొందించుకోవచ్చు అన్నారు. ఇలాంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి ఆర్టీసి డిపోలు నుంచి 90 బస్సులను శుక్రవారం అమరావతిలో జరిగిన ప్రధాని మోదీ సభకు కేటాయించారు. మిగిలిన 260 బస్సులు ప్రైవేట్ సర్వీస్‌లు. అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆర్టీసి బస్సులలో ఎక్కువశాతం సభలకు ఏర్పాటు చేయటం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇదే అదునుగా తీసుకొని ఆటో సర్వీస్‌లు ఇష్టానుసారంగా ప్రయాణికుల దగ్గర వసూళ్ళు చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలి

- సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కొల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులపై ధ్వజమెత్తారు. కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కె.నరసింహారావు నిర్వహించారు. సమావేశంలో పలువురు సభ్యులు తాగునీటి సమస్యల గురించి ఏకరువు పెట్టారు. గ్రామాల్లో పలు చోట్ల చేతి పంపులు పని చేయడం లేదని, కొత్త పంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తమను భాగస్వాములు చేయడం లేదని, కనీస సమాచారం కూడా ఎందుకు ఇవ్వడం లేదంటూ సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీవో ఇకపై అలా జరగకుండా తగిన చర్యలు చేపడతామని ముందస్తు సమాచారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాత్రివేళ భారీ లోడ్‌తో ఇసుక లారీలు తమ గ్రామం నుంచి తెల్లవార్లు వెళుతున్నాయని, అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవులవారిపాలెం సర్పంచ్ తూము నాంచారమ్మ, గాజుల్లంక ఎంపీపీ బావిరెడ్డి వెంకట్రామయ్యలు ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు నరాల రాంబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలుగా పెంచాలి

రేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనాల సలహా బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి కనీస వేతనం రూ.35 వేలుగా నిర్ణయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈనెల 5వ తేదీ ఆర్డీవో కార్యాలయాల వద్ద కార్మికులు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో పాటు పెరుగుతున్న ఇంటి అద్దెలు, ఇతర అవసరాల దృష్ట్యా కనీస వేతనం రూ.35 వేలుగా నిర్ణయించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, నాయకులు సిహెచ్ శివశంకర్, సజ్జా రాజబాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవం

పురపాలక శాఖ పరిధిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 17 మందితో కూడిన నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవాధ్యక్షుడు జీ.బాలాజీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నూతన కమిటీ అధ్యక్షురాలుగా బి.కుసుమకుమారి, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులుగా బేతపూడి కోటేశ్వరమ్మ, శ్యామల, కార్యదర్శిగా పడమట అనురాధ, సహాయ కార్యదర్శులుగా ఎం.శాంతకుమారి, దుర్గాభవాని, కోశాధికారిగా ఎర్రంశెట్టి రాజ్యలక్ష్మి, మరో 9 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.

కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమాల ప్రణాళిక : సీడీపీవో

కొల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రణాళికను ప్రభుత్వం రూపొందించినట్లు సీడీపీవో విజయలక్ష్మి శుక్రవారం అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమాలను మహిళా పోలీసు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, వీవో, వీవోఏ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు నిర్వహించాలన్నారు. కొల్లూరులోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోరి బాలికల పరిచయం, లక్ష్యాల నిర్దేశంపై వారికి అవగాహన కల్పించారు. ఈనెల 4న కిషోరి బాలికల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లిలోని 132/33 కేవీ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రేపల్లె పట్టణం, రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఏడీఈ శ్యామ్‌సుధాకర్ బాబు కోరారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

101వ వార్షిక వేద పరీక్షలు ప్రారంభం

కొల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : 101వ వార్షిక వేద పరీక్షలు కొల్లూరులోని గోవర్ధన మండపంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత జగద్గురు శంకరాచార్యకు విశేష పూజ నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వేద పరీక్షలను గుంటూరు ధర్మపరిపాలన సంఘం నిర్వాహకులు పర్యవేక్షించారు.



నిజాంపట్నం మండలం కేసనవారిపాలెం గ్రామంలో యల్లారమ్మసంబరాలు సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు మేళతాళాలతో, పసుపుకుంకుమలతో, పట్టువస్త్రాలను అందించి మొక్కుబడులను తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో మంత్రిసోదరుడు అనగాని శివప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను కేసన వాసు దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాతా ఏడుకొండలు, కొలసాని రాము, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. - రేపల్లె, ఆంధ్రజ్యోతి

చెరువు సుందరీకరణకు చర్యలు : కమిషనర్



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు

బాపట్ల, మే2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులోని 2వ వార్డులో ఉన్న పురపాలక సంఘ చెరువును కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముళ్ళచెట్లు, పొదలు మధ్య ఉన్న ఈ చెరువు గురించి తెలుసుకున్న కమిషనర్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టారు. చెరువు దగ్గర నుంచి ఆర్అండ్‌బి దగ్గరకు ఉన్న డొంకను శుభ్రం చేయించి రోడ్డు మీద వెళ్ళే వారికి కూడా చెరువు కనిపించే విధంగా చేశారు. జంగిల్ క్లియరెన్స్ చేయించారు. మొత్తం 3 ఎకరాల 39 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి సుందరీకరణ పనులకు అవసరమైన అంచనాలు తయారు చేయాలని మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీవో ఎస్.మల్లికార్జునరావు, సర్వేయర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి



లోకేశ్‌తో మోదీ చమత్కారం ● మోదీతో రాజధాని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశా రు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరిం చుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది.



మోదీతో మంత్రి అనగాని



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మంత్రి లోకేశ్



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీ బయట జనం

అమరావతి పులకింత

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు నాయుడుపై ప్రశంసల జల్లు కురిపించారు. టెక్నాలజీ నేను కనిపెట్టానని చంద్రబాబు చెబుతున్నాడు కానీ వాస్తవానికి నాకంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారని అన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపినట్లు వెల్లడించారు. అభివృద్ధి చేయటం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గురించి మోదీ మాట్లాడుతున్న సందర్భంలో ప్రజల నుండి విశేషమైన స్పందన లభించింది. మోదీ ప్రసంగంలో ఆద్యంతం చంద్రబాబు నాయుడిని ఆకాశానికి ఎత్తటం అమరావతి రైతుల మోము లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికలకు ముందు చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి సభకు హాజరైన ప్రధాన మంత్రి అప్పుడు విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు గురించి పెద్దగా మాట్లాడలేదు. చంద్రబాబు నాయుడు నాకంటే గొప్ప నాయకుడని పొడిపొడిగా ప్రస్తావించడం జరిగింది. అంతే కాదు అమరావతి అభివృద్ధి గురించి ఎటువంటి హామీ కూడా ఇవ్వలేదు. ఎన్నికలు ముగిసి చంద్రబాబు నాయుడు విశేషమైన మెజార్టీతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న తర్వాత మోదీ ఆయనను అవకాశం వచ్చినప్పుడల్లా పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. సహజంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న సందర్భంలో మోదీ మరి ఏ ఇతర నాయకుడు గురించి పెద్దగా ప్రస్తావించిన సందర్భాలు లేవు. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ అందుకు భిన్నంగా ప్రవర్తించి సీఎం చంద్రబాబు నాయుడు పై ప్రశంసల వర్షాన్ని కురిపించారు. గడచిన ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురైన రాజధాని రైతులకు ప్రధాని మోదీ తన ప్రసంగం ద్వారా ఎంతో మనోధైర్యాన్ని కల్పించారు. చంద్రబాబు నాయుడిని ఆయన పొగుడుతున్న సందర్భంలో అమరావతి రైతులు భారీ ఎత్తున హర్షధ్వానాలు చేయటం కనిపించింది. త్వరలో అమరావతి పూర్తయి ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన శక్తిగా మారుస్తుందని మోదీ కొనియాడటంతో భూములను త్యాగం చేసిన రైతులు పరవశించిపోయారు. మరో మూడేళ్ళలో మహా అమరావతి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్న చంద్రబాబుకి తన భుజం కూడా కలిపి శ్రమించి దిగ్విజయం చేసేందుకు సహకరిస్తానని హామి ఇవ్వటంతో ప్రజల హర్ష ధ్వానాలతో ప్రాంగణం హోరెత్తింది.

పోలీసుల తీరు నాడు అలా.. నేడు ఇలా..

గతంలో బొప్పూడి సభ జరిగినప్పుడు పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. సాక్షాత్తు దేశ ప్రధాని హాజరైన సభ అయినప్పటికీ పోలీసులు నాటి ముఖ్యమంత్రి జగన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన్ను మెప్పించేందుకు సభకు హాజరయ్యే జనాలకు ఎన్నో అవరోధాలు కల్పించారు. దాంతో ఆనాడు ఆ సభకు వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులను చవిచూశారు. పోలీసులు సృష్టించిన అడ్డంకుల మూలంగా ప్రజలు బొప్పూడి సభా ప్రాంగణానికి చేరుకునేందుకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో ప్రధాని మోదీ ప్రసంగం ముగిసే సమయానికి కూడా వేలాది మంది సభా ప్రాంగణం వైపు నడుచుకుంటూ రావటం కనిపించింది. అంతే కాదు సభా ప్రాంగణంలో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవటంతో పెద్ద ఎత్తున తొక్కిసలాట జరగ్గా నేరుగా ప్రధాన మంత్రే పలు మార్లు మైక్ తీసుకొని తోసుకోవద్దని పలు మార్లు ప్రజల్ని వారించటమే కాకుండా పోలీసు అధికారులను పదే పదే హెచ్చరించి ప్రాణాపాయం జరగకుండా చూశారు. అయితే శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ పర్యటన

● చంద్రబాబును ఆకాశానికి ఎత్తిన ప్రధాని మోదీ
● టెక్నాలజీ నాకంటే ముందే బాబు తీసుకువచ్చారు
● సైబరాబాద్ చూడటానికి గుజరాత్ నుంచి అధికారులను పంపించా..
● సీఎంపై పొగడ్తల వర్షం ● నాడు బొప్పూడి సభకు.. నేడు వెలగపూడి సభకు ఎంతో తేడా..

సందర్భంగా మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. నాడు అడ్డంకులు సృష్టించిన పోలీసులు నేడు సభను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించారు. వాహనాల రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూశారు. ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాక్షాత్తు పోలీసు ఉన్నతాధికారులే నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు శ్రమిం చారు. మండుటెండలో సైతం పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ఎంతో శ్రమించారు. ఏ మార్గంలో కూడా ట్రాఫిక్ జామ్‌లు లేక పోవటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సభాస్థలికి బయలుదేరిన ప్రజలు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సకాలంలో ప్రాంగణానికి చేరుకోగలిగారు.

పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికిపైగా..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికి పైగా తరలివెళ్లారు. అధికారికంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నేతృత్వంలో 1,100 బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీతో పాటు విద్యా సంస్థల బస్సులను సమకుర్చారు. ప్రజలకు తాగు నీరు, ఆహార వసతిని కల్పించారు. జనం తరలింపును కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షించారు. అధికారికంగా ఏర్పాటు చేసిన వహనాల్లో దాదాపు 55,000 మంది తరలి వెళ్లారని జిల్లా యంత్రాంగం తెలిపింది. పజాప్రతినిధులు, జనసేన, బీజేపీ నేతలు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశారు. పార్టీల పరంగా దాదాపు 50 వేల మంది జన సమీకరణ చేశారు. ఇందులో పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ నేతృత్వంలో 40 వేల మంది వరకు సభకు తరలి వెళ్లారని నేతలు తెలిపారు. జన సమీకరణలో నరసరావుపేట జిల్లా నేతలు, అధికారులు విజయవంతమయ్యారు.



గుంటూరు నుంచి 1900 బస్సుల్లో..

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు శుక్రవారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల నుంచి 1,900 బస్సులను అధి కారులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు ఉదయానికే బస్సులు చేరుకొన్నాయి. సభకు వెళ్లే బస్సులు ఎటువంటి లోటుపాట్లు ఉండ కుండా కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సభ ముగిసిన తర్వాత సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రజల్ని వారి గమ్యస్థానాలకు చేర్చారు. సాధారణ ప్రయాణికుల కోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయించామని గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, పర్యవేక్షించారు.

ప్రధాని సభలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలో శుక్రవారం జరిగిన రాజధాని పునర్నిర్మాణ సభలో కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లు పాల్గొన్నారు. ఏపీబీడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సభలో పాల్గొన్నారు.



సభకు వెళుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల జిల్లా నుంచి భారీగా..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా నుంచి అమరావతి సభకు భారీ ఎత్తున జనం తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 380 బస్సులు శుక్రవారం ఉదయం 7 గంటలకే ఆయా పాయింట్ల వద్దకు చేరుకున్నాయి. 9 గంటలకల్లా దాదాపు అన్ని బస్సులు జనంతో రాజధాని బాటపట్టాయి. ప్రతి బస్సులో ఆశ వర్కర్, ఏఎన్ఎం, పోలీసును నియమించారు. 35 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కంట్రోల్ రూం పనిచేసింది. ఉదయం నుంచి జిల్లా కలెక్టర్ వెంకటమురళి కంట్రోల్ రూంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బస్సుల్లో తరలివెళ్లే ప్రజలకు మార్గమధ్యంలో నాలుగు పాయింట్ల వద్ద భోజనం అందించడానికి యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పొన్నూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో భోజన సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో, బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.



ప్రధానికి ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమరావతి రాజధానిలోని వెలగపూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రధానిని స్వాగతించారు. అలానే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కూడా హెలిప్యాడ్ వద్ద ప్రధానికి స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రధాని మోదీ హెలికాప్టర్‌లో వెలగపూడికి చేరుకొన్నారు. ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌తో పాటు కాన్వాయ్‌గా మరో రెండు హెలికాప్టర్‌లు కూడా వచ్చాయి. సెక్యూరిటీ కారణాల దృష్ట్యా హెలిప్యాడ్ వద్దకు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులెవ్వరిని ఎస్పీజీ బలగాలు అనుమతించలేదు. ప్రధాని తన వాహనంలో కూర్చుని రోడ్డుకు ఇరువైపులా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలకు అభివాదం చేస్తూ సభా స్థలికి చేరుకొన్నారు. వేదిక వెనుక ఏర్పాటు చేసిన అమరావతి గ్యాలరీలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తదితరులను ప్రధాని పలకరించారు.

వర్చువల్ విధానంలోనే...

అమరావతి రాజధాని పనుల పునరుద్ధరణతో పాటు రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ తదితర శాఖల అభివృద్ధి పనులన్నింటిని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలోనే ఆవిష్కరించారు. సభా స్థలి వెనక 20 అడుగుల పైలాన్‌ని ఏ(అమరావతి) ఆకారంలో సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్మించాయి. అయితే వివిధ కారణాల రీత్యా ఆ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేశారు. దాంతో నాగాయలంక వద్ద క్షిపణి ప్రయోగ పరీక్ష శ్రేణి, గోరంట్ల - హిందూపూర్ నాలుగు వరసల రహదారి విస్తరణ, ముద్దనూరు - బీ కొత్తపల్లి ఫోర్‌లేన్ హైవే విస్తరణ, నంద్యాల - కర్నూలు రెండు వరసల రహదారి విస్తరణ, ముదిరెడ్డిపల్లె - కడప/నెల్లూరు సరిహద్దు వరకు రెండు వరసల రహదారి విస్తరణ, ఎన్‌హెచ్-16 పరిధిలో రణస్థలం వద్ద ఆరు వరసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, యర్రమంచి - గుడిపల్లి గ్రామాల్లో ఆర్‌వోబీ, గుంతకల్లు వెస్టు - మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య ఆర్‌వోబీ, విశాఖపట్టణం మధురవాడలో పీఎం ఏక్తా మాల్ పనులకు వర్చువల్‌లో ప్రధాని శంకుస్థాపన చేశారు. అలానే పూర్తి అయిన జాతీయ రహదారులు, రైలు మార్గాలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.



మోదీతో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం





• కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు



• సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక • రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ కోలాహలం నెలకొంది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



5న తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన

మార్టూరు, మే2 (ఆంధ్రజ్యోతి) : ఏపిటిఎఫ్ మార్టూరు జోన్ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 5వతేదీన సోమవారం సాయంత్రం 4 గంటలకు మండల తహసిల్దారు కార్యాయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్ శుక్రవారం ఒ క ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు విరివిగా హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

ఘనంగా శంకరాచార్యులు జయంతి

అద్దంకి,మే2(ఆంధ్రజ్యోతి): ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదిశంకరాచార్యులు చిత్రపటం ఏర్పాటు చేసి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగరకొండలోని బ్రహ్మణ నిత్య అన్నదాన సత్రంలో ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు చి త్రపటాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సత్రం కమిటీ అధ్యక్షుడు ఆదిపూడి మోహన్‌రావు, పమిడి ఘంటం చం ద్రశేఖర్, ధేనువకొండ సుబ్బారావు, పుట్టంరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో శుక్రవారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుక నిర్వహించారు. స్థాని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజారి ఓంకారశర్మ పర్యవేక్షణలో జయంతి వేడుక జరిగింది. కార్యక్రమంలో రవిచంద్రాచారి, కందుకూరి మల్లికార్జున, ఆత్మలింగాచారి, పలువురు భక్తులు పాల్గొన్నారు. రిపూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

తిరుమల నుంచి విశాఖ వస్తుండగా ప్రమాదం

తమిళనాడులో పలు పుణ్యక్షేత్రాలనూ దర్శించుకున్న భక్తులు

బాధితులు వైజాగ్, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారే

స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు

మార్టూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : తిరుమల నుంచి విశాఖకు వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు జాతీయరహదారి పక్కన బోల్తాపడింది. ఈ సంఘటన మార్టూరు మండలం రాజుపాలెం రెస్ట్ ఏరియా సమీపంలో శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా కుడివైపునకు తిరగడంతో, వెనుక నుంచి వస్తున్న బస్సు డ్రైవరు ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు ఈడ్చుకుంటూ వెళ్లి ఆరుఅడుగుల గోతిలో పడింది. ఆ సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో దాదాపు మూడొంతుల మంది మహిళలే. వారంతా విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వారు. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి మార్టూరు సీఐ శేషగిరిరావు తన సిబ్బందితో వెళ్లారు. వెంటనే హైవే అంబులెన్స్, హైవే మొబైల్ పోలీసులు, 108 వాహనం సిబ్బంది వచ్చి ప్రయాణికులను బయటకు తీశారు. స్వల్పంగా గాయపడిన 13 మంది మహిళలను, ఇద్దరు పురుషులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని సమీపంలోని రెస్ట్ ఏరియాకు తరలించారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో పోలీసులు బోల్తాపడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ప్రయాణికులు బస్సులోని సామాన్లు తీసుకున్నారు. అనంతరం వారందరినీ వైజాగ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులలో పోలీసులు పంపించారు.



బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



ప్రభుత్వ ఆస్పత్రినుంచి వైద్యం చేయించుకొని బయటకు వస్తున్న మహిళలు

గత నెల 9న విశాఖ నుంచి బయలుదేరి...

గత నెల 9న విశాఖ నుంచి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని 38 మంది ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. భీమలి మండలం ఉప్పాడ, చిట్టివలస, భోగాపురం మండలం గుడివాడ, తూర్పుగోదావరి జిల్లా కాట్రేని కోన మండలం దర్శితిప్ప, అమలాపురం తదితర గ్రామాలకు చెందిన వారు రామేశ్వరం, కంచి, మధుర, అరుణాచలం తదితర పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నారు. గురువారం తిరుమల వచ్చి వెంకటేశ్వరుని స్వామిని దర్శించుకున్నారు. రాత్రికి బస్సులో విశాఖకు బయలుదేరగా మార్గమధ్యలో ప్రమాదానికి గురయ్యారు. డ్రైవరు ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. తదనంతరం ఆమె ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రసవాలు జరిగే విధంగా గర్భణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ వైద్యశాల కంటే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామీణ యోజన కార్డులపై 65 ఏళ్ల నిండిన వారికి అవగాహన కల్పించి, వారికి కార్డులు అందజేయాలని సూచించారు. వేసవికాలంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ లలితారాజేశ్వరి, వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్, సూపర్‌వైజర్లు స్వర్ణలత, చిరంజీవి, ఉల్దారాణి పాల్గొన్నారు.



ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : యువ క్రీడాకారులలో కబడ్డీ పట్ల ఆసక్తి పెంపొందించి, వారిలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని జిల్లా క్రీడా శాఖాధికారి కే పాల్‌కుమార్ చెప్పారు. స్థానిక బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. క్రీడాకారులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆసక్తి కలిగిన క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ ఎం.గిరిబాబు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో, వాలీబాల్, హాకీ కోచ్‌లు జె.పవల్, రాధాకృష్ణ, వి.వెంకటయ్య పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారులతో డీఎస్‌డీవో పాల్‌కుమార్

శభాష్ ప్రసాద్... అవీఇవీ

దొరికిన సొమ్ము రూ.1.80 లక్షలు బాధితునికి అందజేత

నిజాయితీ చాటుకున్న టీ బంక్ నిర్వాహకుడు



బాధితునికి నగదును అందజేస్తున్న ఎస్సై మాల్యాద్రి

పర్చూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న నగదును బాధితునికి అప్పగించి నిజాయితీని చాటున్న టీబంక్ నిర్వాహకున్ని పర్చూరు ఎస్సై మాల్యాద్రి అభినందించారు. స్థానిక వైజంక్షన్ సమీపంలో టీ బంక్ వద్ద గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి టీ తాగి సమీపంలో తనతోపాటు తెచ్చుకున్న రూ.1.80 లక్షల నగదుతో ఉన్న బ్యాగును అక్కడే జారవిడిచి వెళ్లిపోయాడు. రాత్రి 10గంటల తరువాత దుకాణం సర్దుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన ఆలపాటి ప్రసాద్‌కి అక్కడ బ్యాగ్ ఉండటం గుర్తించారు. సమీపంలో ఎవరూ లేకపోవటంతో బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో ఎక్కువ మొత్తంలో నగదు ఉంది. వెంటనే పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై ఎస్సై విచారించగా మొక్కజొన్నల ట్రేడింగ్ కోసం వచ్చిన పొన్నూరుకు చెందిన డొక్కు సీతారామరాజుదిగా తెలిసింది. దీంతో అతనికి సమాచారం అందించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితునికి ఆ సొమ్మును అందజేశారు. దీంతో ప్రసాద్‌ను ఎస్సై మాల్యాద్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో పఠాన్ సమీర్, సతీష్, లంకా లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

నాగండ్లలో బంగారం చోరీ

ఇంకొల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఆవుల వెంకాయమ్మ ఇంట్లో చోరీ జరిగింది. వెంకామయ్మ తన గొలుసు, ఒక జత గాజులు ఇంట్లో అలమరలో పెట్టుకొని బయట వరండాలో నిద్రిస్తుండగా ఇంటి కిటికీ చువ్వలు వంచి లోపలకు జొరబడి వాటిని ఎత్తుకెళ్లారు. దీనిపై ఆమె స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన 4 సవర్ల బంగారు వస్తువులు సుమారు రూ.1.40 లక్షల విలువ ఉంటుందని అంచనా

మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్ అదుపుతప్పి కల్వర్టుపై నుంచి వాగులో పడటంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... పంగులూరు మండలం కోటపాడుకు చెందిన అయ్యప్ప శుక్రవారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై అద్దంకి వస్తుండగా కశ్యాపురం, జార్లపాలెం మధ్య ఉన్న వాగు కల్వర్టుపై నుండి అదుపు తప్పి పడిపోవటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అతన్ని ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

జనకవరంలో సీసీ కెమెరాల ఏర్పాటు

పంగులూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనకవరం గ్రామంలో ఐదు ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్.ఐ వినోద్‌బాబు చెప్పారు. నేర పరిశోధనలో నిఘనేత్రాలుగా సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. 70 వేల వ్యయంతో వీటి ఏర్పాటుకు సహకరించిన గుర్రం ఆదిశేఖర్‌తో పాటు గ్రామస్థులను ఎస్.ఐ. అభినందించారు.

మంచి మార్కులు సాధించడం అభినందనీయం

ప్రభుత్వపాఠశాలల్లో పది విద్యార్థులకు సన్మానం

ఇంకొల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి ఏ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన దాసరి నాగపద్మజ(గంగవరం), ద్వితీయ స్థానం సాధించిన దొడ్డి అశ్విని(పావులూరు), తృతీయస్థానం సాధించిన గట్టుపల్లి నిషికాంత్(ఇంకొల్లు)లతో పాటు పాఠశాలల స్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పేర్ని సత్యనారాయణ, చిలుకూరి హనుమంతరావు, చెంచయ్య, శివరామకృష్ణప్రసాద్, ఆదినారాయణ, నాగేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునిసిపల్ షాపుల అద్దె బకాయిలు రూ.28.44.870 లక్షలు

మూడు రోజుల్లోగా బకాయి చెల్లించాలని నోటీసులు!

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏఆర్ఎం మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సు మొదటి అంతస్తుకు సంబంధించి లీజుదారుడు జాగర్లమూడి శ్రీనివాసరావు రూ.28.44.870 లక్షలు బకాయి పడ్డారు. ఈ బకాయి అక్టోబరు 2023 నుంచి ఏప్రిల్ 2025 వరకు ఉంది. దీనిపై మూడు రోజుల్లోగా సమాధానం కోరుతూ మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ గత శుక్రవారం నోటీసులు కూడా జారీ చేశారు. ఈ విషయం ప్రస్తుతం సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై కమిషనర్ వివరణ కోరగా లీజుదారుడు ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. మరో వారంలోగా బకాయి చెల్లించనున్నట్లు తెలిపారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మ ఆశ్రమంలో విశ్వకర్మ సిద్ధు సేవా ట్రస్ట్ ముప్పవరం ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ సిద్ధు వెంకటసుబ్బారావు పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అంతకుముందు శంకరాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ అధ్యక్షుడు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

సమయం లేదు యంత్రాంగమా..!





గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగర్ కాలువలు కనీస మరమ్మతులకూ నోచుకోలేదు. ప్రస్తుతం అవి పూడిక పేరుకుపోయి చిల్లచెట్లు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా చిల్లచెట్లను తొలగించుకొని పంటలకు నీరందేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక కాలువలు మరమ్మతులకు తొలిసారి అవకాశం ఏర్పడింది. అందుకు మే, జూన్ నెలల్లో మాత్రమే. ఆ తరువాత వర్షాలు పడితే కాలువల్లో నీటిని విడుదల చేస్తారు. అప్పుడు కాలువల్లో పూడిక తీయటం, అభివృద్ధి చేయటం సాధ్యమయ్యే పనికాదు. తక్షణమే కాలువలకు మరమ్మతులు చేయాల్సిన అవసరాన్ని అధికార యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - పర్చూరు

భక్తిశ్రద్ధలతో శ్రీమహాలక్ష్మమ్మ గ్రామ పొంగళ్లు

భారీగా తరలిన భక్తులు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లగాంధీ బొమ్మ వద్ద శ్రీమహాలక్ష్మమ్మ వారి గ్రామ పొంగళ్ల వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సుమారు 300 ఏళ్ల క్రితం ఆలయం కావడంతో ఏటా జరిగే వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ సంతరించుకుటుంది. అంతేకాకుండా ఆలయ కమిటీ ఏర్పడి కూడా 25వ వసంతాలు అయ్యాయి. ఈక్రమంలో శుక్రవారం కమిటీ ప్రతినిధులు ఆద్యంతం కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాలకు వాడరేవు లలితానంత సరస్వతి ఆశ్రమం ఆశీస్సులతో జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.ఈ శంకరరావు, చింతా రమేష్, వాసుబాబు, లక్ష్మయ్య, వాసుదేవరావు, కిషోర్ పాల్గొన్నారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


అలంకరణలో అమ్మవారు

కిశోరి బాలికలు చదువు, ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలు చదువు, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ చెప్పారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం కౌమారబాలికల సాధికారత వైపు పయనం అనే అంశంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వయస్సుతో వచ్చేశారీరక మార్పులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎ.ఎన్.ఎం. శేషకుమారి,అంగన్‌వాడీలు సుధారాణి, శ్యామల, శ్రీలక్ష్మి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.


ముప్పవరంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిషోర బాలికలకు శిక్షణా తరగతులు

ఇంకొల్లు,మే 1,(ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ పరిధిలోని ఇంకొల్లు మండల సెక్టార్‌లోని పావులూరు గ్రామంలో కిశోరి బాలికలకు వేసవి శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో ఝాన్సీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10వతేదీ వరకు శిక్షణ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వాణి,హర్షిత,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను కిశోరి బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో టి.ఝాన్సీ చెప్పారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో కిశోరి బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు జరుగుతాయని, వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాల్లో జరిగే శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఉషాకుమారి పాల్గొన్నారు.


చినగంజాంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీలు, బాలికలు

కార్మిక చట్టాలపై అవగాహనతో ప్రయోజనం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు వారికి సంబంధించిన చట్టాలపై అవగాహన ఉంటే ఎంతో ఉపయోకరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని చెప్పారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శుక్రవారం రామకృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ వ్యాపార సంస్థ పరిధిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులంతా జాతి, మతం భేదం లేకుండా మేడే నాడు కార్మికుల దినోత్సవం ఆచరించడం అభినందనీయమన్నారు. సమాన పనికి సమాన వేతనం పొందడం వారి హక్కు అని, లైంగిక వేధింపులు, ఇతర సమస్యల నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది రమేష్‌బాబు, రామకృష్ణారెడ్డి, స్నేహ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మార్గదర్శకులు 'దాచూరి'


రామిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు దాచూరి రామిరెడ్డి అని పలువురు యూటీఎఫ్ ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో దాచూరి వర్ధంతి సభ నిర్వహించారు. దీంతో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవలి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన 15 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో భిక్షాలుబాబు, వినయ్‌కుమార్, శ్రీనివాసరావు, పాపారావు, సురేష్, రామారావు, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఉప సర్పంచ్ అశోక్, గ్రామస్థులు

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు-వలపర్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రామకూరు నుంచి వలపర్ల వరకు కిలోమీటరుకు పైగా బీటీరోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని గ్రామ ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్ చెప్పారు.

ముళ్లచెట్ల తొలగింపు

బల్లికురవ, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం-గుంటుపల్లి గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డులో ముళ్ల చెట్లు దట్టంగా పెరగటంతో ప్రజలు తీవ్రఇబ్బంది పడుతున్నారు. దీంతో ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ నిధులతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ముళ్లచెట్లను యంత్రంతో తొలగించారు. వాహనాదారులకు ఇబ్బందులు తొలగిపోయాయని ప్రజలు తెలిపారు. ఈ రోడ్డును గుంటుపల్లి గ్రామం వరకు అభివృద్ధి పరచాలని ముక్తేశ్వరం ప్రజలు కోరుతున్నారు.

100 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు

పంగులూరులో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని చినమల్లవరం రోడ్డులో శుక్రవారం విద్యుత్ అధికారులు 63 కేవీ ట్రాన్స్‌ఫారం తొలగించి దాని స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా లోఓల్టేజ్ కారణంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ ఈఈ నల్లూరి మస్తానరావు చొరవతో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారమైనట్లు ఏఈ అనిల్‌కుమార్ చెప్పారు. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఐదువేల జనాభా కలిగి ఉన్న గ్రామంలో మరో ట్రాన్స్‌ఫారం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


చినమల్లవరం రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారం

రాజధాని పునర్నిర్మాణాన్ని చూసొద్దాం..

ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో భారీగా తరలిన ప్రజలు

చీరాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చూసొద్దామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో అధిక సంఖ్యలో టీడీపీ కూటమి నాయకులు, ప్రజలు, పొదుపు సంఘాలు, మెప్మా సిబ్బంది తరలివెళ్లారు. ఈసందర్భంగా వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాకపోకల సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఎమ్మెల్యే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతీ బస్‌లో ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆహారం, తాగునీటిని అందుబాటులో ఉంచారు. చీరాల మునిసిపల్ పరిధిలో 20, గ్రామీణం 20, వేటపాలెం మండలంలో 19 బస్‌లు ఏర్పాటు చేశారు. అలాగే సుమారు 50 కార్లు ప్రధానీ మోదీ సభకు కదిలాయి. అధికారులు వసతులకు సంబంధించి పర్యవేక్షించారు.


అమరావతి సభలో మంత్రులు భరత్, స్వామితో మంత్రి రవికుమార్


చీరాలలో బస్‌లకు జెండాలు ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అమరావతికి తరలిన నేతలు, కార్యకర్తలు

అద్దంకి, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పనులు పునఃప్రారంభ సభకు అద్దంకి పట్టణం, మండలం నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులతో పాటు సొంత వాహనాలలో వెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక భోజన, ఇతర ఏర్పాట్లు చేశారు. అమరావతిలో జరిగిన మోదీ సభకు సహచర మంత్రులు భరత్, స్వామిలతో కలిసి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

బల్లికురవ నుంచి...

బల్లికురవ, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి బల్లికురవ మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు శుక్రవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. అధికారులు 13 బస్సులను ఏర్పాటు చేశారు. ఉప్పుమాగులూరు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, కొప్పెరపాడు, కొణిదెన గ్రామాల నుండి మహిళలు సైతం ఉత్సాహంగా తరలి వెళ్లడం గమనార్హం. ఈ సందర్భంగా పలువురు టీడీపీ మహిళ నేతలు జై అమరావతి అంటు నినాదాలు చేశారు. ఎంపీడీవో కుసుమకుమారి, మండల టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు అధికారులు దగ్గర ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.


పర్చూరులో అమరావతికి బయలుదేరిన నేతలు, ప్రజలు

పంగులూరు నుంచి...

పంగులూరు, మే 2(ఆంధ్రజ్యోతి):అమరావతి పునర్నిర్మాణ వేడుకలో పాల్గొనేందుకు మండలంలోని 21 గ్రామాల నుంచి 12 ప్రత్యేక బస్సులు, వందకు పైగా కార్లలో మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి వెళ్ళారు. వెళ్లిన వారికి అధికారులు అవసరమైన అల్పాహారంతో పాటు భోజన సదుపాయం వంటి ఏర్పాట్లు చేశారు. ముప్పవరం నుంచి బయలుదేరిన వాహనాల ర్యాలీని టీడీపీ నేతలు జెండాఊపి స్వాగతం పలికారు.

మార్టూరులో...

మార్టూరు, మే2 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మోదీ సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మార్టూరులో టీడీపీ కార్యాలయం నుంచి బయలుదేరిన బస్సులకు నాయకులు కామినేని జనార్దన్ జండా ఊపి ప్రారంభించారు. మండలం నుంచి 11 బస్సుల్లో కార్యకర్తలతో పాటు మహిళలు కూడా తరలివెళ్లారు. 75 కార్లు, 150 ద్విచక్రవాహనాలలో నాయకులు తరలివెళ్లారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో 11 బస్సుల్లో, కార్లలో, ద్విచక్రవాహనాలలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మార్టూరు, యద్దనపూడి మండలాల నుంచి తరలివెళ్లిన కార్యకర్తలకు రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద భోజనాలు ఏర్పాటుచేశారు. అంతేగాకుండా వారికి ఆరోగ్య కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీఐ శేషగిరిరావు, ఎస్సై రత్నకుమారి, తహసీల్దారు ప్రశాంతి భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

పర్చూరు, కారంచేడు నుంచి...

పర్చూరు/కారంచేడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు అమరావతి పునర్నిర్మాణానికి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లారు. తొలుత టీడీపీ నాయకులు స్థానిక బొమ్మల సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరి సారథ్యంలో మండల ప్రత్యేక అధికారి శ్యాంసన్, ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు జెండా ఊపి బస్సులను తరలించారు.

చినగంజాం నుంచి...

చినగంజాం, మే 2(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల కార్యాలయాల సముదాయం వద్ద అమరావతి వెళ్తున్న వాహనాలకు మండల టీడీపీ అధ్యక్షుడు పొద వీరయ్య జెండా ఊపి ప్రారంభించారు. సంతరావూరు గ్రామంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, పెదగంజాంలో టీడీపీ నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, రాజుబంగారుపాలెంలో కోకి భాస్కరరెడ్డి, కడవకుదురులో నక్కల వీరరాఘవులు, చల్లా వెంకటరావు, కొత్తపాలెంలో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నీలాయపాలెంలో తూమాటి శ్రీనివాసరావు, మున్నంవారిపాలెంలో వెంకటేశ్వరరెడ్డి, సోపిరాల గ్రామంలో చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, చినగంజాం గ్రామంలో రాయని ఆత్మారావుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో బస్సులు, కారుల్లో అమరావతి తరలివెళ్లారు.

ఇంకొల్లు నుంచి...

ఇంకొల్లు,మే 1,(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ప్రదానమంత్రి మోడీ బహిరంగ సభకు ఇంకొల్లు మండలం నుంచి 60 వాహనాల్లో ప్రజలు తరలివెళ్లారు. గ్రామాల నుండి ఒక్కొక్క బస్సును అందుబాటులో ఉంచగా కొంత మంది కార్యకర్తలు, అభిమానులు 50 కార్లలో వెళ్లినట్లు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు చెప్పారు.